సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 11 । మార్చి । 2025



వన సంరక్షణే ధ్యాసగా..
అన్నపురెడ్డిపల్లికి చెందిన చెరుపల్లి రాములు అటవీ ప్రాంత సంరక్షణకు చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.
8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.23
సహర్ (బుధవారం ఉ॥) 5.03

వాతావరణం
గరిష్టం / కనిష్టం 38° / 21°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని తెలంగాణ ఉద్యోగ జేఏసీ కార్యదర్శి, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటపుల్లయ్య, టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు డెక్క నర్సింహారావు, గగ్గూరి బాలకృష్ణ,తో పాటు పడిగ నరసింహారావు, సాదిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

భద్రాచలం/దుమ్ముగూడెం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి, పర్ణశాల ఆలయాల్లో ఈ నెల 30 నుంచి వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. 30వ తేదీ ఉగాది రోజున రక్షాబంధనం, ఉత్సవాంగ స్నపనం, మృత్సంగ్రహణం, 31 ఏప్రిల్ 1 తేదీల్లో తిరువీధి సేవలు, 2న గరుడ పట లేఖనం, సార్వభౌమ వాహన సేవ, 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ పూజ, బలిహరణం, హనుమద్వాహన సేవ, 5 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం జరగనున్నాయి. 6న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 7న మహాపట్టాభిషేకం, 8న సదస్యం, హంస వాహన సేవ, 9న తెప్పోత్సవం, చోరోత్సవం, అశ్వవాహన సేవ, 10న ఊంజల్ సేవ, సింహ వాహన సేవ, 11న వసంతోత్సవం, ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి గజవాహన సేవ, 12న చక్రతీర్థం, పూర్ణాహుతి, శేష వాహన సేవ, ధ్వజావరోహణం, పుష్పయాగంలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ రమాదేవి వెల్లడించారు. కాగా, పర్ణశాలలో ఈ నెల 14న ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా కల్యాణ తలంబ్రాలు కలపడంతో పాటు పసుపు దంచే వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ హుండీల లెక్కింపు

137 రోజులకు రూ.41.23 లక్షల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.భేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి పర్యవేక్షణలో లెక్కించారు. 137 రోజులకు గాను రూ.41,23,907 లభించాయని, ఈ నగదుతో పాటు వివిధ విదేశీ కరెన్సీ, మిశ్రమ వెండి, బంగారం లభించాయని ఈఓ వివరించారు. కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ మధుసూదన్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో వైద్యుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేటలోని ఏరియా ఆస్పత్రులు, పాల్వంచ సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, మత్తు, రేడియాలజీ, నేత్ర వైద్య నిపుణులు, ఆసక్తి గల ఇతర నిష్ణాతులైన వైద్య నిపుణులను కాంట్రాక్టు పద్ధతిన నియమిస్తామని వివరించారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్, వైద్య నిపుణులకు రూ.2 లక్షలు, మత్తు, జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్య నిపుణులకు రూ.1.50 లక్షలు, ఇతర వైద్య నిపుణులకు రూ.లక్ష వేతనం ఇస్తామని పేర్కొన్నారు.

మారితే.. మనం ఎటు?!

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జరిగిన పునర్విభజనతో నియోజకవర్గాల రూపురేఖలు, రిజర్వేషన్లు మారిపోయాయి. కొన్ని స్థానాలు జనరల్ నుంచి రిజర్వ్‌లోకి, రిజర్వ్‌డ్‌గా ఉన్న స్థానాలు కొన్ని జనరల్‌కు మారాయి. అలాగే, తొమ్మిదిగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పదికి చేరింది. ఇక వచ్చే సాధారణ ఎన్నికల సమయానికి పునర్విభజన చేపట్టేలా కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోందనే ప్రచారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ నియోజకవర్గ పరిస్థితి ఎలా ఉంటుందోనని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. అయితే, 2026 తర్వాత జనాభా లెక్కల అనంతరమే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని చట్ట సవరణ చేయగా.. ఇప్పుడు ఈ ప్రక్రియపై ఎందుకు కసరత్తు జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల పునర్విభజనపై పార్టీల్లో చర్చ
- చివరిగా 2008లో స్థానాల పునర్విభజన
- అప్పుడు తొమ్మిది నుంచి 10కి పెరిగిన అసెంబ్లీ సీట్లు
- రిజర్వేషన్లలోనూ మార్పులు
- ఈసారి పెంపు, రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ

ఇప్పుడే ఎందుకు?
పెరుగుతున్న జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంటారు. తద్వారా నియోజకవర్గాల సంఖ్య పెరగడమే కాక సరిహద్దులు మారుతుంటాయి. ఇందుకోసం తొలిసారిగా 1963లో డీ లిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నియోజకవర్గాల సరిహద్దులు, రిజర్వేషన్లు నిర్ణయిస్తుంది. చివరిసారి 2008లో 2001 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేపట్టారు. ఆ సమయంలోనే 84వ చట్ట సవరణ ద్వారా 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల ఆధారంగా మరోమారు పునర్విభజన చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యాన ఇప్పుడు పునర్విభజనకు సిద్ధం కావడాన్ని కొన్ని పార్టీలు తప్పుపడుతున్నాయి.

మారిన రిజర్వేషన్లు..
2008లో చేపట్టిన డీలిమిటేషన్ కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల పరిధి, రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. తద్వారా కొందరు నేతలకు ఇబ్బంది ఎదురుకాగా, మరికొందరికి కలిసొచ్చింది. అప్పటి వరకు తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా.. కొత్తగా అశ్వారావుపేట ఏర్పాటైంది. ఇందులో అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, ములకలపల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు చేరాయి. రాష్ట్ర విభజన తర్వాత కుక్కునూరు, వేలేరుపాడు ఏపీలోకి వెళ్లగా.. ఇక్కడ కొత్తగా అన్నపురెడ్డిపల్లి మండలం చేరింది. ఇక బూర్గంపాడు నియోజకవర్గం రద్దయి ఆ స్థానంలో పినపాక చేరింది. అంతేకాక జనరల్ నియోజకవర్గమైన సుజాతనగర్ రద్దు కాగా.. ఆ స్థానంలో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా వైరా నియోజకవర్గం ఏర్పడింది. అలాగే సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలు జనరల్ నుంచి ఎస్సీ రిజర్వ్‌కు, ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న పాలేరు జనరల్ కేటగిరీలోకి వచ్చింది. ఈ క్రమంలో జనరల్ కేటగిరీలో కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు మాత్రమే మిగిలాయి.

ఏం చేద్దాం.. ఎలా వెళ్దాం
నియోజకవర్గాల పునర్విభజన చర్చ మొదలవడంపై రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. ఒకవేళ డీలిమిటేషన్ జరిగితే తమకు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న మండలాలు ఇతర నియోజకవర్గంలో కలిసే అవకాశం ఉందా అన్న అంశంపై ఆరా తీస్తున్నారు. అయితే నియోజకవర్గానికి ఎంత జనాభా ఉండాలనే అంశంపై స్పష్టత రాకపోవడంతో ఇంకొందరు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను మూడు జనరల్‌గా ఉన్నాయి. ఈసారి పునర్విభజనపై పూర్తి వివరాలు వెల్లడి కాకపోవడంతో రిజర్వ్ స్థానాలు తగ్గుతాయా, పెరుగుతాయా.. రిజర్వేషన్లలో మార్పులు జరుగుతాయా, స్థానాల సంఖ్య పెరుగుతుందా అన్న అంశంపై అయోమయం నెలకొంది. కాగా, గత పునర్విభజన సమయాన కీలక నేతలు కొందరు సిట్టింగ్ స్థానాలు వదిలి ఇతరచోట్ల నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. సుజాతనగర్ నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి పాలేరుకు వెళ్లగా, పాలేరులో పోటీ చేసి పలుమార్లు గెలిచిన సంభాని చంద్రశేఖర్, ఒకసారి గెలిచిన సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లికి, సత్తుపల్లి నుంచి తుమ్మల నాగేశ్వరరావు సైతం తమ కార్యక్షేత్రాన్ని మార్చారు. ఈసారీ ఇలాంటి పరిస్థితులే ఏర్పడతాయా అన్న అనుమానాలు నేతల్లో వ్యక్తమవుతున్నాయి.

రెండుగా ఖమ్మం..
ఈసారి చేపట్టనున్న డీలిమిటేషన్ విధివిధానాలు ఇప్పటివరకైతే బయటకు రాలేదు. ఒక్కో నియోజకవర్గానికి ఎంత మంది జనాభాను పరిగణనలోకి తీసుకుంటారో తేలాల్సి ఉంది. అయితే, డీలిమిటేషన్ చేపడితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఖమ్మంతో పాటు భద్రాద్రి జిల్లాలో 2001 జనాభా లెక్కలతో పోలిస్తే ఇప్పుడు పెరిగింది. గత పునర్విభజన సమయాన కొత్తగా అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుత జనాభాను పరిశీలిస్తే ఈసారి పునర్విభజనలో ఒక్క నియోజకవర్గమైనా పెరుగుతుందని పలువురు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం నియోజకవర్గం జనాభా పరంగా రెట్టింపు అయినందున ఈ నియోజకవర్గం రెండుగా ఏర్పడే అవకాశమున్నట్లు చర్చ జరుగుతోంది.

ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయండి

లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా సహా తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా ఉన్నందున కేంద్రప్రభుత్వం ఆధ్వర్యాన ప్రాంతీయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుండగా, ప్రస్తుతం 91,200హెక్టార్లలో ఉన్న సాగును ఏటా 40వేల హెక్టార్ల మేర విస్తరించాలనే లక్ష్యం ఉందని తెలిపారు. సుస్థిర వ్యవసాయానికి మద్దతు ఇస్తూనే నూనె ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కోసం రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యాన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ ఆధ్వర్యాన ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ వెల్లడించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ పాటిల్

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్‌తో కలిసి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..
- లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన రైతు వనపర్తి వీరభద్రం.. తనకు 68 ఏళ్లు వచ్చినందున వ్యవసాయం చేయలేకపోతున్నానని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేయగా డీఆర్‌డీఓకు ఎండార్స్ చేశారు.
- సీతారామ ప్రాజెక్టు కింద నష్టపోయిన తమ భూములకు పరిహారంగా ప్రభుత్వం ఇచ్చిన సొమ్మును గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, బ్యాంకు సిబ్బంది కలిసి తమకు మాయమాటలు చెప్పి సంతకాలు చేయించుకుని, ఆ డబ్బును వారి ఖాతాల్లో వేసుకున్నారని అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. తమకు పోడుభూములు ఇప్పిస్తామని, భూముల్లో బోర్లు వేయిస్తామని నమ్మించారని, వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని చేసిన దరఖాస్తు చేయగా ఎస్పీకి ఎండార్స్ చేశారు.
- పాల్వంచ నవభారత్ గాంధీనగర్‌లో మున్సిపల్ రోడ్డు, డ్రైనేజీపై ఉన్న స్థలంలో నలుగురు వ్యక్తులు చట్టవిరుద్ధంగా గోడ కట్టారని, దానిని తొలగించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీని నిర్మించాలని శ్రావణబోయిన మల్లీశ్వరి చేసిన దరఖాస్తును పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి
కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని, లేకుంటే చర్య తప్పదని కలెక్టర్ హెచ్చరించారు. ఉదయం 10.30 – 10.45 వరకు విధులకు రాకుంటే గైర్హాజరుగా పరిగణిస్తామని, అవసరమైతే షోకాజ్ నోటీసు ఇస్తామని స్పష్టం చేశారు.

ఏఐతో బోధన సులభం..
బూర్గంపాడు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో విద్యాబోధన సులభమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అంజనాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏఐ విద్యాబోధనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు, సులువుగా అర్థమయ్యేందుకు ఏఐ సహకరిస్తుందన్నారు. విద్యార్థులు ఏఐ క్లాసులను వినియోగించుకోవాలన్నారు. బూర్గంపాడు మండలంలో అంజనాపురం, మోరంపల్లిబంజర, బూర్గంపాడు-2, నాగినేనిప్రోలు, గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ తరగతులను ప్రారంభించామని తెలిపారు. అనంతరం బూర్గంపాడు గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని ఆరా తీశారు. పాఠశాలలో అవసరమైన వసతులపై నివేదిక ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంపీ బంజరలో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ యదుసింహరాజు, డీటీ రామ్‌నరేష్ పాల్గొన్నారు.

ఇల్లెందులో స్థల పరిశీలన..



ఇల్లెందులో స్థల పరిశీలన అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందులో ప్రభుత్వ ఐటీఐ, 100 పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలకు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి కలెక్టర్ పాటిల్ స్థలాలను పరిశీలించారు. వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి తలపెట్టిన స్థలం, సింగరేణి క్వార్టర్లను సందర్శించారు. మార్కెట్ స్థలంతో పాటు ఉప్పడి మిల్లు వరకు గల సింగరేణి టీచర్ల క్వార్టర్లను ఖాళీ చేసి వారం రోజుల్లో ప్రభుత్వానికి అప్పగించేలా సహకరించాలని జీఎం వి.కృష్ణయ్యను కోరారు. సింగరేణి సబ్‌స్టేషన్ సమీపంలోని క్వార్టర్లను కూడా ఖాళీ చేయించాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. ఈ స్థలాలను మ్యాపింగ్ చేసి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని సర్వేయర్‌కు సూచించారు. ఈనెల 17న మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని, ఈలోగా పనులన్నీ పూర్తి కావాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ డీఈ విద్యాసాగర్, ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మండల రాము, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, పూనెం సురేందర్ పాల్గొన్నారు.

ఆఖరులో ఆగమాగం!

- గడువు చివరలో నిధులు కేటాయింపు
- ఉపాధి హామీలో 974 పనులు మంజూరు
- సీసీ రోడ్లకు రూ.49.98 కోట్ల మేర నిధులు




ఉపాధిహామీ కింద సీసీ రోడ్డు పోస్తున్న దృశ్యం

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లను సీసీ రహదారులుగా మార్చడానికి ఉపాధి హామీ పథకంలో కేంద్రప్రభుత్వం జిల్లాకు భారీగా నిధులు కేటాయించింది. ఈ నిధులతో పల్లెల్లో సీసీరోడ్లు నిర్మిస్తుండగా ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేలా పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో భారీగా పనులు మంజూరు చేస్తుండగా ఈ సంవత్సరం కూడా జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.49.98 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పనుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని నిధులు కేటాయించారు.

974 సీసీ రోడ్లు మంజూరు..
2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 974 సీసీ రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికోసం రూ.49.98 కోట్లు నిధులు కేటాయించింది. అశ్వారావుపేట నియోజకవర్గంలో 143 పనులకు రూ.11.60 కోట్లు, కొత్తగూడెంలో 165 పనులకు రూ.6.74 కోట్లు, ఇల్లెందులో 136 పనులకు రూ.7.54 కోట్లు, భద్రాచలంలో 193 పనులకు రూ.8.44 కోట్లు, పినపాక నియోజకవర్గంలో 316 పనులకు రూ.14.15 కోట్లు, వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో 21 పనులకు రూ.1.11 కోట్ల చొప్పున కేటాయించారు. ఈనెల 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా ఆలోపే పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే నిధులు వెనక్కు వెళ్లిపోతాయి. దీంతో పలుచోట్ల అధికారులు ఆగమేఘాల మీద పనులు చేపడుతున్నారు. అయితే హడావిడిగా చేపడుతున్న సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత, పర్యవేక్షణ లోపిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. పలు చోట్ల సిమెంట్ తక్కువగా పోయడం, అక్కడక్కడా నాణ్యత లేని ఇసుక ఉపయోగిస్తుండడం, క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడం వంటి లోపాలు కనిపిస్తున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణం అనంతరం కనీసం 28 రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సి ఉండగా చాలాచోట్ల వరి గడ్డి వేసి వారం రోజుల పాటు నీటి తడితో ముగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో సీసీ రోడ్లకు రోజూ క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయాలి. లేకపోతే రోడ్డు నాణ్యతపై ప్రభావం చూపుతుందని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రతీ సారి ఈజీఎస్‌లో చేపడుతున్న సీసీ రోడ్ల బిల్లుల కోసం కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు నెలల కొద్దీ ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరలో మంజూరవుతున్న పనులను ఆగమేఘాల మీద చేపట్టి పూర్తి చేస్తున్నా వీరికి సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. పలువురు బయట నుంచి అప్పులు తెచ్చి మరీ సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం



జిల్లాలో 974 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఆయా పనుల్లో జాప్యం చేయకుండా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. జిల్లాలో ఇప్పటికే చాలా వరకు పనులను మొదలుపెట్టాం. మిగిలిన పనులను సైతం రెండు, మూడు రోజుల్లో చేపట్టి గడువులోగా పూర్తి చేస్తాం. నాణ్యతలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ

ప్రభుత్వ పథకాలు గిరిజనుల దరి చేరాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనుల చెంతకు చేర్చేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించాలని సూచించారు. అర్హతల మేరకు వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల రిపోర్టును తనకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు.

కెరీర్ గైడెన్స్ అమలుపై అభినందనలు..
రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో పీఓ రాహుల్ ప్రారంభించిన కెరీర్ గైడెన్స్ అమలు చేయడంపై అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా అధికారులు, సిబ్బందితో పీఓ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

గిరిజన సంస్కృతి ప్రతిబింబించాలి..
గిరిజన మ్యూజియంలో చిత్రాలు, కళాకృతుల ద్వారా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాలని పీఓ అన్నారు. గిరిజన మ్యూజియాన్ని పరిశీలించిన ఆయన బీచ్ వాలీబాల్, బాక్స్ క్రికెట్ గ్రౌండ్, బోటింగ్ కు ఏర్పాటు చేస్తున్న చెరువు పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గిరిజనుల ఆరాధ్య దైవాల చరిత్ర, దేవతల ప్రతిమలు, సమ్మక్క సారక్క గద్దెలు డిజైన్ చేయించి అమర్చాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏఓ సున్నం రాంబాబు, ఈఈ చంద్రశేఖర్, గురుకులం ఆర్‌సీఓ నాగార్జున రావు, ఆర్‌ఓఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఏపీఓ వేణు, వ్యవసాయ శాఖ ఏడీ భాస్కరన్, అధికారులు మనిధర్, ఉదయ్‌కుమార్, ప్రభాకర్‌రావు, గోపాల్‌రావు, నవ్య, ఆదినారాయణ, నారాయణరావు, జయరాజ్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



దర్బార్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

వృత్తి శిక్షణ తరగతులు నిర్వహించాలి

భద్రాచలంటౌన్: డిగ్రీ విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు వృత్తి శిక్షణ తరగతులు నిర్వహించాలని పీఓ రాహుల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ (అటామస్) కళాశాల ప్రచార కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాల వివరాలతో పాటు సౌకర్యాలు, సాధించిన విజయాలు, కళాశాల ప్రాముఖ్యతను వివరించేలా కరపత్రాలను తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు గంటల పాటు నీరు ఎత్తిపోత

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామంలో గల సీతారామ ప్రాజెక్ట్ ఫేస్-1 పంప్‌హౌస్ నుంచి సోమవారం ఒక మోటారు ద్వారా రెండు గంటల పాటు నీరు దిగువకు ఎత్తిపోశారు. గంటకు 5.4 ఎంసీఎఫ్‌టీ చొప్పున 10.8 ఎంసీఎఫ్‌టీ నీరు వదిలారు. ఆనకట్ట వద్ద గోదావరిలో నీటి మట్టం తగ్గి 49.1 మీటర్లు ఉండడంతో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రెండు గంటల పాటు మాత్రమే నీరు వదిలారు.

సింగరేణిలో 20 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 20 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఒక జీఎంతోపాటు ముగ్గురు డిప్యూటీ జీఎంలు, ఇద్దరు కాలరీ మేనేజర్లు, ఎనిమిది మంది అడిషనల్ మేనేజర్లు, ఒక డిప్యూటీ మేనేజర్, ఇద్దరు ఎస్ఈలు, ఇద్దరు డిప్యూటీ ఎస్ఈలు, ఒక అండర్ మేనేజర్ ఉన్నారు. వీరంతా ఈనెల 20వ తేదీ లోగా తమకు కేటాయించిన ఏరియాల్లో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో సూచించారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని రంగాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరాచారి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా, పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు సెలవులో ఉండడంతో డీఈఓ అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా సమగ్ర శిక్ష ఫైనాన్స్ అధికారి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

శభాష్ లక్ష్మీరెడ్డి..

రైతును అభినందించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల


మంత్రి తుమ్మలతో ఫోన్‌లో మాట్లాడుతున్న రైతు లక్ష్మీరెడ్డి

బూర్గంపాడు: బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు యారం లక్ష్మీరెడ్డిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. సోమవారం లక్ష్మీరెడ్డికి స్వయంగా ఫోన్‌చేసి మాట్లాడారు. పుచ్చ సాగులో ఎకరాకు 20 టన్నుల నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నందుకు మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పుచ్చ, బొప్పాయి వంటి పంటల్లో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించడం అభినందనీయమని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని రైతులు ఉద్యానవన పంటలు సాగుకు ముందుకు రావాలన్నారు. నాణ్యమైన పంటల సాగుకు రైతులకు ప్రభుత్వం ప్రోత్సహకాలను అందిస్తోందని మంత్రి తెలిపినట్లు రైతు లక్ష్మీరెడ్డి వివరించారు.

అప్రెంటిస్ మేళాలో 136 మంది ఎంపిక


మేళాకు హాజరైన అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన పీఎం నేషనల్ అప్రెంటిష్ మేళాకు 300 మంది అభ్యర్థులు హాజరుకాగా, 136 మంది అప్రెంటిస్‌కు ఎంపికయ్యారు. టాటా ఏరోస్పేస్ 40 మంది, మేథో సర్వే డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) 13 మంది, ఎల్‌అండ్‌టీ (చెన్నై) 54 మంది, టీ హబ్ హైదరాబాద్ కంపెనీ 29 మందిని ఎంపిక చేసుకున్నాయి. ఏజీఎం రామ్మోహన్‌రావు, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో చెలరేగుతున్న మంటలు


అగ్నికి ఆహుతి అవుతున్న చెట్లు

ములకలపల్లి: మండల పరిధిలోని రామాంజనేయపురం శివారులో మంటలు ఎగసి పడుతున్నాయి. సీతారామ ప్రాజెక్ట్ కాలువ వద్ద సోమవారం రాత్రి అటవీ ప్రాంతంతోపాటు, తెలంగాణా స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎఫ్‌డీసీ) పరిధిలోని ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. చెట్లు అగ్గికి బుగ్గి అవుతున్నాయి.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ములకలపల్లి: పురుగుల మందు తాగి సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. ములకలపల్లిలోని శివాలయం వీధికి చెందిన పాదిల సతీష్ (38)కు ఏలూరుకు చెందిన జ్యోతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన సతీష్ ఏ పనీ చేయకుండా తిరుగుతుండగా పలుమార్లు గొడవలు జరిగాయి. దీంతో భార్య మనస్తాపం చెంది రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనోవేదన చెందిన సతీష్ ఈ నెల 8న పురుగుల మందు తాగాడు. ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి దుర్గ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వన సంరక్షణే ధ్యాసగా..

- అటవీప్రాంత పరిరక్షణకు పాటుపడుతున్న అన్నపురెడ్డిపల్లివాసి
- పలు అవార్డులు పొందిన చెదురుపల్లి రాములు


అవార్డులతో రాములు


రాములును సత్కరిస్తున్న దివంగత మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఓ సామాన్యుడు వన సంరక్షణకు పాటుపడుతున్నాడు. ప్రకృతి సంపద పరిరక్షణకు నిత్యం కృషి చేస్తున్నాడు. దాదాపు ఏడు వందల హెక్టార్లలో ఉన్న వనసంరక్షణ సమితి(వీఎస్ఎస్) అడవిలో ఒక్క ఎకరంలో కూడా పోడు నరకకుండా అడ్డుకున్నాడు. అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన, వీఎస్ఎస్ చైర్మన్ చెదురుపల్లి రాములు గౌడ్ అటవీ ప్రాంత సంరక్షణకు చేస్తున్న కృషిని గుర్తించి ప్రభుత్వాలు పలు అవార్డులు సైతం ఇచ్చాయి. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబునాయుడుతోపాటు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నాడు. శ్రీలంక దేశానికి చెందిన ప్రముఖ అధికారులు అన్నపురెడ్డిపల్లి వచ్చి అటవీ సంరక్షణకు ఇతని నుంచి సలహాలు తీసుకున్నారు. వీఎస్ఎస్ చైర్మన్ అయిన రాములు రోజూ కిలోమీటర్ల కొద్దీ కాలినడకనే తిరుగుతూ అటవీప్రాంతాన్ని పర్యవేక్షిస్తాడు. అటవీశాఖలో సామాన్య ఉద్యోగి నుంచి ఐఎఫ్ఎస్ అధికారి వరకు రాములును అన్నా అని సంబోధిస్తారు. 2002 నుంచి 2006 వరకు పలు అవార్డులు పొందిన రాములు ప్రస్తుతం 60 ఏళ్ల వయసులోనూ వన సంరక్షణకు కృషి చేస్తున్నాడు.

> **ఎక్కువ సమయం అడవిలోనే..**
>
> చిన్ననాటి నుంచే నాకు అడవి అంటే ఇష్టం. 1996లో వనసంరక్షణ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాను. అప్పటి నుంచి 700 హెక్టార్ల అడవిని కాపాడుతున్నాను. మూడు దశాబ్దాల్లో ఎక్కువకాలం అడవిలోనే గడిపాను. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 300 వనసంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం మా కమిటీ ఒక్కటే పనిచేస్తోంది. – రాములు, వీఎస్ఎస్ చైర్మన్, అన్నపురెడ్డిపల్లి

క్రీడాసామర్థ్యం లేని విద్యార్థుల తొలగింపు

కిన్నెరసాని, కాచనపల్లి క్రీడాపాఠశాలల్లో 33మంది

పాల్వంచరూరల్: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేలా క్రీడాపాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అయితే, నెలల తరబడి శిక్షణ ఇచ్చినా తగిన స్థాయిలో సామర్థ్యం కనబర్చని వారిని తొలగించాలని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం ఐటీడీఏ పర్యవేక్షణలో పాల్వంచ మండలం కిన్నెరసానిలో గిరిజన బాలురు, గుండాల మండలం కాచనపల్లిలో గిరిజన బాలికలకు క్రీడాపాఠశాలలు ఏర్పాటు చేశారు. బ్యాటరీ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులు 240మంది చొప్పున చదువుతుండగా ఉదయం, సాయంత్రం కోచ్‌ల ద్వారా వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. అయితే కొందరు క్రీడల్లో ఆశించిన స్థాయిలో ప్రతిభ చాటడం లేదు. దీంతో కిన్నెరసాని పాఠశాల నుంచి 15మంది, కాచనపల్లి పాఠశాల నుంచి 18మంది కలిపి 33మందిని వచ్చే ఏడాది స్కూల్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈవిషయమై ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావును వివరణ కోరగా.. అనారోగ్యం తదితర కారణంగా క్రీడల్లో రాణించలేని విద్యార్థులను తొలగించి, ఇతర పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు.

పామాయిల్ క్షేత్రంలో పరిశీలన

పరిహారం కోసం బాధిత రైతు నుంచి దరఖాస్తు స్వీకరించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


పామాయిల్ క్షేత్రంలో రైతుతో మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ మేనేజర్ రాధాకృష్ణ

దమ్మపేట : పామాయిల్ నర్సరీ డివిజనల్ ఇన్‌చార్జ్ మేనేజర్ నాయుడు రాధాకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ జగ్గారం శివారులోని రైతు చెలికాని సూరిబాబు పామాయిల్ క్షేత్రాన్ని సోమవారం సందర్శించారు. 'ఆఫ్‌టైప్ మొక్కల నరికివేత' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయిల్ ఫెడ్ అధికారులు స్పందించారు. దిగుబడి రాకపోవడంతో నరికివేసిన ఆఫ్‌టైపు మొక్కలను పరిశీలించారు. ఆఫ్‌టైప్, నాణ్యతలేని గెలలు వస్తున్న మొక్కల వివరాలు, సాగు చేస్తున్న విధానంపై రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొద్దినెలల వరకు మొక్కలను నరకొద్దని అధికారులు సూచించగా.. నాణ్యత లేని మొక్కలకు ఏమైనా భరోసా ఇవ్వగలరా అని రైతు ప్రశ్నించాడు. కానీ అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. నష్టపరిహారం కోసం బాధిత రైతు నుంచి దరఖాస్తు మాత్రం స్వీకరించారు.

తొమ్మిది నిమిషాలు లేట్..

ఇంటర్మీడియట్ పరీక్షకు అనుమతించని అధికారులు


పరీక్షకు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన విద్యార్థిని

పాల్వంచరూరల్: నిర్దేశించిన సమయం కంటే తొమ్మిది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోమవారం అధికారులు పరీక్షకు అనుమతించలేదు. వేడుకున్నా అధికారులు కనికరించకపోవడంతో రోదిస్తూ వెనుదిరిగింది. మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు చర్లకు చెందిన జి.సుభాషిణి సోమవారం ఉదయం 9 గంటల 9 నిమిషాలకు చేరుకుంది. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తులసిని అర్ధగంటసేపు వేడుకున్నా కనికరించలేదు. సమయం మించిపోయిందని లోపలకు రానివ్వకుండా గేటు వద్దే నిలిపివేశారు. విషయం జిల్లా నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినా అనుమతి ఇవ్వలేమని తెలిపారు. దీంతో విద్యార్థిని కన్నీరు పెట్టుకుని వెనుదిరిగి వెళ్లిపోయింది. కాగా సోమవారం నిర్వహించిన సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు పాల్వంచలోని నాలుగు కేంద్రాల్లో 969 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 24మంది గైర్హాజరయ్యారు. 945 మంది హాజరయ్యారు.

పసికందు విక్రయ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: రెండు రోజుల మగ శిశువును విక్రయించిన కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. 2016లో కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన నందబాల బాల వరలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు తమ రెండో కుమారుడు, రెండు రోజుల మగ శిశువును సిరిసిల్లకు చెందిన గాజుల రవీందర్‌కు విక్రయించారు. రూ. 80 వేలకు ఒప్పందం చేసుకోగా, అడ్వాన్స్ రూ.50 వేలు ఇచ్చి రవీందర్ పసికందును తీసుకెళ్లాడు. విషయం తెలియడంతో అప్పటి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పయ్యావుల రమాదేవి కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.విశ్వశాంతి వాదించగా, సీఐ శివప్రసాద్, నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్‌కుమార్, సిబ్బంది అబ్దుల్ ఘని, బి.శోభన్ సహకరించారు.

యువకుడి ఆత్మహత్య


గుట్టపై నాగేశ్వరరావు మృతదేహం

జూలూరుపాడు: కుటుంబ కలహాలతో సోమవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తవిసిగుట్ట తండాకు చెందిన భూక్యా నాగేశ్వరరావు(34) కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు చింతలపూడి తండా గ్రామశివారులో నగల భీముడు గండం గుట్టపై లొకేషన్ ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు వెళ్లి ఆ ప్రాంతంలో గాలించగా మృతదేహం లభించింది. మృతుడి సోదరుడు ప్రసాద్ ఫిర్యాదుతో ఎస్ఐ బి.రవి కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. టేకులపల్లి ఎస్ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని బేతంపూడి గ్రామానికి చెందిన చేతుల రాములు (53) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 7న రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు రఘుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భార్య, వదినపై కత్తితో దాడి

అశ్వారావుపేటరూరల్: భార్య, వదినపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని గుంటూరుకు చెందిన దమ్ము ఉమామహేశ్వరి, శ్రీనివాసరావు దంపతులు ఏడాది క్రితం వలస వచ్చి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీలో ఉంటున్నారు. భర్త శ్రీనివాసరావు మద్యం తాగి భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా గొడవ జరిగింది. దీంతో ఉమామహేశ్వరి భయంతో సమీపంలోనే ఉన్న అక్క కొప్పుల వెంకటలక్ష్మి ఇంటికి వెళ్లింది. శ్రీనివాసరావు అక్కడికి కూడా వెళ్లి భార్యతో వాగ్వాదం పెట్టుకున్నాడు. కత్తితో దాడి చేయగా ఆమె ఎడమ చేతిపై గాయమైంది. ఈ క్రమంలో అడ్డుగా వెళ్లిన వెంకటలక్ష్మిని కూడా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు గాయపడినవారిని అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి పంపించారు. వెంకటలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్లంలో మిర్చి దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న మిర్చి

పినపాక: దుండగులు నిప్పంటించడంతో కల్లంలో మిర్చి దగ్ధమైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మండల పరిధిలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన పానగంటి పురుషోత్తం మిర్చి కోయించి కల్లంలో ఆరబెట్టాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి నిప్పంటించడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులతో సమాచారంతో ఫైర్ ఇంజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే సుమారు 40 క్వింటాళ్ల వరకు మిర్చి కాలిపోయిందని బాధిత రైతు తెలిపాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన నాగేశ్వరరావుకు 13 ఏళ్ల క్రితం సావిత్రితో వివాహం జరిగింది. ఇటీవల నాగేశ్వరరావు భార్యను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

ఇద్దరు రిమాండ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ చాంబర్ ఎదుట ఈ నెల 4న అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. రామకృష్ణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు భద్రాచలానికి చెందిన భాను, నరేష్‌లుగా గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు భాను తనకు ఉద్యోగం ఇప్పించాలంటూ గతంలో సూపరింటెండెంట్‌ని పలుమార్లు అడగగా, ఆయన నిరాకరించడంతోనే ఈ చర్యకు పాల్పడ్డాడని సమాచారం.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బూర్గంపాడు: బూర్గంపాడుకు సమీపంలోని కిన్నెరసాని నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ట్రాలీ వాహనం..

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని కిన్నెరసాని వాగునుంచి ట్రాలీ వాహనంలో ఇసుక తరలిస్తుండగా రాజాపురం గ్రామం వద్ద పట్టుకున్నారు. నిందితులు సమ్మయ్య, రజింత్‌లపై కేసు నమోదు చేశారు.

పీహెచ్‌సీలో చెట్లు దగ్ధం


పీహెచ్‌సీ ప్రాంగణంలో దగ్ధమైన చెట్లు

చంద్రుగొండ : చంద్రుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో దుండగులు నిప్పు పెట్టారు. దీంతో ప్రాంగణంలో ఉన్న పచ్చని చెట్లు దగ్ధమయ్యాయి. హరితహారంలో భాగంగా వైద్యసిబ్బంది కొన్నేళ్ల క్రితం పండ్ల మొక్కలతోపాటు నీడనిచ్చే, క్రోటాన్ మొక్కలు నాటారు. ఏపుగా పెరిగిన చెట్లతో ఆస్పత్రి ప్రాంగణం కళకళలాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఆహ్లాదం అందించింది. కానీ మంటలకు చెట్లన్నీ కాలిపోయి ప్రాంగణం బోసిపోయి దర్శనమిస్తోంది.

అడవి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన సూరిబాబు

మణుగూరు టౌన్: మండల పరిధిలోని బుగ్గ గ్రామ పంచాయతీకి చెందిన వ్యక్తి అడవి పంది దాడిలో సోమవారం తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమరం సూరిబాబు తునికిపండ్లు సేకరిస్తుండగా అడవి పంది దాడి చేసింది. తుంటి భాగంలో, తలకు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 100 పడకల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సూపరింటెండెంట్ సునీల్ భద్రాచలం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా బాధితోడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు సామాజిక కార్యకర్త నాగులజ్యోతి సోమవారం భద్రాచలంలో వినతిపత్రం ఇవ్వగా.. పీఓ భరోసా ఇచ్చారు.

